## క్లుప్తంగా

### సాయి మందిరంలో సత్యనారాయణవ్రతం

**ఓజిలి:** మానమాల గ్రామంలోని సాయి మందిరంలో ఆదివారం సత్యనారాయణవ్రతాన్ని పండితులు వైభవంగా నిర్వహించారు. మందిరంలో మండపం ఏర్పాటు చేసి సత్యనారాయణస్వామి చిత్రపటం ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సత్యనారాయణ స్వామివ్రత విధానం, మహిమలను తెలియజేశారు. అనంతరం అన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### పెంచలకోనలో టూరిస్ట్ పోలీస్‌స్టేషన్



పెంచలకోనలో టూరిస్ట్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్న అధికారులు

**రాపూరు:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో టూరిస్ట్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు పోలీసు అధికారులు ఆదివారం రంగం సిద్ధం చేస్తున్నారు. సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆన్‌లైన్ ద్వారా పర్యాటక కేంద్రాల్లో టూరిస్ట్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుచేయాలని ఆదేశించడంతో పర్యాటక కేంద్రమైన పెంచలకోనలో పోలీస్‌స్టేషన్‌లో కావాల్సిన ఏర్పాట్లను పోలీసు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. క్రైం అడిషనల్ ఎస్పీ ప్రసాద్, రాపూరు సీఐ కోటేశ్వరావు, ఎస్‌ఐ క్రాంతికుమార్, ఏఎస్‌ఐ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

### ఘనంగా విగ్రహ ప్రతిష్ట వేడుకలు



కోదండరామస్వామి విగ్రహం

**వెంకటగిరిరూరల్(బాలాయపల్లి):** బాలాయపల్లి మండలంలోని నిడిగల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి దేవస్థానంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సాగిన ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. తొలుత ఆలయంలో విఘ్నేశ్వరపూజ, విగ్రహ ప్రతిష్ట, నాడి సంధానం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

### ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న మస్తాన్‌యాదవ్

**రాపూరు:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం మస్తాన్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 1,500 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్యులు డాక్టర్ మస్తాన్‌యాదవ్, నాగేంద్రప్రసాద్, అభినయ్ పాల్గొన్నారు.

### పూరిల్లు దగ్ధం

**కోట:** షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి పూరిల్లు దగ్ధమైన సంఘటన ఆదివారం కొత్తపాళెంలో చోటుచేసుకుంది. కొత్తపాళెంలోని యలమల వెంకయ్యకు చెందిన తాటాకుల పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటల్లో చిక్కుకుంది. బాధితుడు కోట ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో రూ.70వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

### కోడిపందెం రాయుళ్లు నలుగురు అరెస్ట్

**దొరవారిసత్రం:** వెదురుపట్టు గ్రామంలోని కోడిపందెం స్థావరంపై ఎస్‌ఐ తిరుమలరావు ఆధ్వర్యంలో పోలీసుల ఆదివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో కోడిపందేలు ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేశారు. వీరిని సోమవారం సూళ్లూరుపేట కోర్టులో హాజరు పరుస్తామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

### కండలేరులో 47.372 టీఎంసీలు

**రాపూరు:** కండలేరు జలాశయంలో ఆదివారం 47.372 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 1,210 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 30, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయీజ్‌కు 70, హైలెవల్ స్లూయీజ్‌కు 180 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

---

వేనాడులో వెలసిన శృంగేశ్వర శ్రీరంగపెరుమాళ్ ఆలయం



మాంబట్టు శివాలయం



# చెరగని శివుని చరిత్ర



వేనాడులో శివయ్యను తాకుతున్న సూర్యకిరణాలు



మాంబట్టులో పూజలందుకుంటున్న శివయ్య



వేనాడులో శృంగేశ్వరునిగా వెలసిన శివయ్య

- మండలంలో కొలువైన చారిత్రక శివాలయాలు
- వందల ఏళ్ల చరిత్ర, అపురూప నిర్మాణాలు

**తడ:** తమిళనాడు సరిహద్దుల్లోని తడ మండలంలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన శివాలయాలు ఉన్నాయి. తమిళ ప్రజలు శివ, వైష్ణవులను సమానంగా కొలిచినా ఎక్కువగా భోళాశంకరునికే ప్రాధాన్యత ఇస్తారు. సరిహద్దు ప్రాంతం కావడంతో తడ మండలంపై తమిళ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అందులోభాగంగానే తమిళనాడు తరహాలో మండలంలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన శివాలయాలు దర్శనమిస్తాయి. ఇందులో ముఖ్యంగా వెయ్యేళ్ల చరిత్ర కలిగిన మాంబట్టులో వెలసిన గంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వాటంబేడులో వెలసిన విశాలాక్షి సమేత ప్రసన్న కాశీ విశ్వేశ్వరాలయం, వేనాడులో వెలసిన శృంగేశ్వర శ్రీరంగ పెరుమాళ్ ఆలయాలు ఉన్నాయి. వీటితోపాటు బీఎల్‌పాడు గ్రామంలోని భువనేశ్వరీ సమేత భువనేశ్వరాలయం, అండగుండాల సమీపంలోని నాగేశ్వరస్వామి ఆలయాలతోపాటు వేనాడు పంచాయతీ, మూలగ్రామంలో శివరాత్రి రోజున మాత్రమే భక్తుల పూజలు అందుకునే మహిమాన్విత అళఘునారీశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. ఇవే కాక వెలుగులోకి రాని మరెన్నో శివాలయాలు, శివలింగాలు మండల పరిధిలో ఉన్నాయి. అంతరిక్ష రాకెట్ ప్రయోగ కేంద్రం షార్‌కి అరకోటి లింగాల కోట శ్రీహరికోటగా మరో పేరు ఉందంటే ఈ ప్రాంతంలో శివయ్యకు ఎంత ప్రాధాన్యత ఉందో తెలుస్తోంది.

**మాంబట్టు శివాలయం:** 11వ శతాబ్దంలో చోళులు ఈ ఆలయాన్ని నిర్మించినట్టు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. సూక్ష్మరూపంలో స్పటిక లింగంగా భక్తుల పూజలు అందుకునే ఈ ఆలయంలో శివలింగం కేవలం ఆరు అంగుళాల ఎత్తు, మూడు అంగుళాల వెడల్పు మాత్రమే ఉంటుంది. స్వయంభుగా వెలసినట్టు కొందరు, కాశీ నుంచి ప్రత్యేకంగా తెప్పించినట్టు మరి కొందరు చెబుతారు. తూర్పు ముఖంగా ఉండే ఈ శివలింగంపై ప్రతిఏటా జూలై మాసంలో ప్రాతఃకాలంలో సూర్యకిరణాలు వారం రోజుల పాటు స్వామి విగ్రహాన్ని తాకుతాయి. స్వామి ఆలయానికి ఎదురుగా గోడకు అమర్చిన కిటికీ గుండా కిరణాలు ప్రసరించడం జరుగుతుంది. ఇదే ఆలయంలో దక్షిణ ముఖంగా ఉన్న అన్నపూర్ణాదేవి సుందర వదనంతో భక్తులకు కనిపిస్తారు. ఆలయంలో ఉన్న నవగ్రహ విగ్రహాలు కంచిరాళ్లగా పిలవబడే ప్రత్యేక రాళ్లతో చెక్కడంతో అత్యంత సుందరంగా నేటికీ నిఘనిఘ లాడుతూ ఉంటాయి.

**వేనాడు ఆలయం:** చారిత్రక కట్టడాలకు నిలువెత్తు సాక్ష్యంగా వేనాడు శివాలయం ఉంటుంది. ఇక్కడ ఒకే ప్రాంగణంలో శివ, వైష్ణవ ఆలయాలు ఉంటాయి. వీటిని 7 శతాబ్దాల క్రితం నిర్మించినట్టు చెబుతున్న ఈ ఆలయంలో శృంగేశ్వరునిగా భక్తుల పూజలందుకునే శివలింగం తూర్పు ముఖంగా ఉంటుంది. ఓ వైపునకు ఒరిగినట్టు ఉండే ఈ విగ్రహంపై శివరాత్రి సమయంలో సూర్యోదయ కిరణాలు మూడు రోజుల పాటు శివలింగం పైనుంచి కింద వరకు జారుతూ అభిషేకించడం జరుగుతుంది. అదేవిధంగా పడమ దిక్కుగా ఉన్న పెరుమాళ్ నిలువెత్తు విగ్రహంపై మే మాసంలో సాయం సంధ్య వేళ సూర్యకిరణాలు మూడు రోజులు స్వామిపాదాలను తాకుతూ పైకి ఎగబాకి హృదయ భాగం వరకు వచ్చి మాయం అవడం భక్తులకు కనువిందు చేస్తుంది. అదేవిధంగా వాటంబ ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉండగా మూల గ్రామంలోని శివలింగానికి కేవలం శివరాత్రి రోజున మాత్రమే ప్రత్యేక పూజలు ఉంటాయి.

## భూములు పరిశీలించిన ఆర్డీఓ

**వాకాడు:** మండలంలోని పలు ప్రభుత్వ భూములను ఆదివారం గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా దుగ్గరాజపట్నం రెడ్‌క్రాస్ సంస్థకు చెందిన 76 ఎకరాల భూములతోపాటు నెల్లిపూడి గ్రామంలోని సీజేఎఫ్ఎస్ భూములను పరిశీలించారు. అనంతరం కొండూరుపాళెం మత్స్యకారులతో మాట్లాడారు. దుగ్గరాజపట్నం రెడ్‌క్రాస్ సంస్థ ఎంతోకాలంగా మూతపడి పనిచేయడంలేదని గ్రామస్తులు ఆర్డీఓకు వివరించారు. ఐతే సంస్థకు చెందిన భూముల్లో కొండూరుపాళెంకు చెందిన కొందరు నిరుపేద మత్స్యకారులు కొంతకాలంగా సాగు చేసుకుంటున్నారన్నారు. ఆయా భూములను నిరుపేద మత్స్యకార కుటుంబాలకు 8వ విడత భూపంపిణీలో కేటాయించాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నేత మహీంద్ర ఆర్డీఓను కోరారు. ఈయన వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ సారంగపాణి ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

## సూర్య, చంద్రప్రభలపై కపిలేశ్వరుడి తేజసం



సూర్యప్రభపై విహరిస్తున్న కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మ

**తిరుపతి కల్చరల్:** కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఇందులోభాగంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కపిలేశ్వరస్వామిని సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు స్నపన తిరుమంజనం చేశారు. సోమస్కంద మూర్తి, కామాక్షి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పండ్ల రసాలు, చందనంతో అభిషేకం చేశారు. రాత్రి 8 నుంచి 10 గంటల వరకు కపిలేశ్వరస్వామి చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించి ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

## సత్తెమ్మకు పాల పొంగళ్లు

**కలువాయి:** తోపుగుంటలో వెలసిన గ్రామదేవత సత్తెమ్మకు ఆదివారం గ్రామస్తులు పాల పొంగళ్లు పెట్టుకున్నారు. ప్రతిఏటా ఒక వారం తోపుగుంట వాసులు, మరోవారం అగ్రహారం వాసులు సత్తెమ్మకు పొంగళ్లు పెట్టుకోవడం ఆనవాయితీ. ముందుగా ఈ ఆదివారం తోపుగుంట వాసులు సత్తెమ్మకు పాల పొంగళ్లు పెట్టుకున్నారు. సత్తెమ్మను పూలతో విశేషంగా అలంకరించి ఆలయంలో పూజలు చేశారు.

సత్తెమ్మ ఆశీస్సులుంటే గ్రామం భోగభాగ్యాలతో అలరారుతుందని గ్రామస్తుల నమ్మకం. దీంతో గ్రామం నుంచి దూరప్రాంతాలకు వెళ్లి స్థిరపడిన గ్రామస్తులంతా కార్యక్రమానికి తప్పక విచ్చేస్తారు. ఆదివారం గ్రామం మొత్తం మేళతాళాలతో ఊరేగింపుగా సత్తెమ్మ గుడికి తరలివచ్చింది. పూజలు చేసి, పొంగళ్లు పెట్టి, అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఈఏడాది నూతనంగా నిర్మిస్తున్న ఆలయంలో కొత్తగా ఏర్పాటుచేసి అలంకరించిన అమ్మవారి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి. తోపుగుంట వాసులతోపాటు చుట్టుపక్కల గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



విశేష పూల అలంకరణలో సత్తెమ్మ



సింహవాహనంపై సత్తెమ్మ

# వేడుకగా ఏకాదశ రుద్రాభిషేకం



రుద్రాభిషేకంలో పూజలు చేస్తున్న సాయికృష్ణ యాచేంద్ర



రుద్రాభిషేకంలో పూజలు చేస్తున్న రాంప్రసాద్ యాచేంద్ర

–వేలాదిగా తరలివచ్చిన భక్తకోటి

**వెంకటగిరి:** భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర వేదాధ్యాయన విభాగం ఆధ్వర్యంలో వెంకటగిరి రాజాకుటుంబీకుల సహకారంతో పురాతన శైవక్షేత్రం కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వేడుకగా నిర్వహించారు. సత్యసాయిసేవా సంస్థల నిర్వాహకులు డాక్టర్ కె.సాయి శ్రీహరిప్రసాద్ శర్మ పర్యవేక్షణలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య రుద్రాభిషేకం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఎస్వీబీసీ చైర్మన్, స్థానిక రాజాకుటుంబీకులు డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర, ఆయన సోదరుడు సత్యప్రసాద్ యాచేంద్రలో రుద్రాభిషేకంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్వీబీసీ చైర్మన్ మాట్లాడుతూ 1964, 1968 సంవత్సరాల్లో భగవాన్ సత్యసాయిబాబా వారే చేతుల మీదుగా స్థానిక కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. ఆయన రుద్రాభిషేకం నిర్వహించిన ప్రాంతంలోనే సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా రుద్రాభిషేకం నిర్వహించడం పూర్వజన్మ సుకృతమని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సత్యసాయి సేవా సమితి సభ్యులు వేలాదిగా తరలిరావడంతో వెంకటగిరిలో ఆదివారం పండుగ వాతావరణం నెలకొంది. రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

---

## పెళ్లకూరు దాతృత్వం వెలకట్టలేనిది



రిటైర్డ్ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వవిద్యార్థులు

- పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తాం
- శతాబ్ది ఉత్సవాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

**గూడూరు:** వేలాది మంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసిన పాఠశాల ప్రదాత పెళ్లకూరు దశరథరామిరెడ్డి దాతృత్వం వెలకట్టలేనిదని ఎస్పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలు పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి, పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన, 100 సంవత్సరాల పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం దాత పెళ్లకూరు దశరథరామిరెడ్డి కుమారుడు సురేంద్రరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. అదేవిధంగా గతంలో ఈ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి పదవీ విరమణ చేసిన, ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వందేళ్లు పూర్తిచేసుకున్న ఈ పాఠశాలకు ఎంతో ఘనచరిత్ర ఉందన్నారు. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులెందరో దేశ, విదేశాల్లో ఉన్నతమైన స్థాయిలో ఎందరో ఉన్నారన్నారు. అలాంటి వారంతా కూడా కార్యక్రమానికి తమవంతుగా సహాయ సహకారాలు అందజేసి, ఎంతో ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పూర్వవిద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకంటి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ అప్పుడు ఈ పరిసర ప్రాంతాల్లో ఎక్కడా ఉన్నత పాఠశాలలు లేవని, ఎందరో ఈ పాఠశాలలోనే చదవులు అభ్యసించి, ఉన్నతస్థాయిలో ఉన్నారన్నారు. అలాంటి వారందరి సహాయ సహకారాలతోనే ఈ శతాబ్ది ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించామని తెలిపారు. అదేవిధంగా ఇక్కడ చదివిన విద్యార్థులు తమ వంతుగా అభివృద్ధికి కూడా ఎందరో ఆర్థికంగా సాయం అందించారన్నారు. పెద్దసంఖ్యలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎల్లసిరి

## ఓపెన్ మారథాన్‌లో నాయుడుపేట అథ్లెట్ల ప్రతిభ

**నాయుడుపేటటౌన్:** తమిళనాడు, తిరుప్పూర్ జిల్లా వెల్లకోయిల్ పట్టణంలో ఆదివారం జరిగిన 3.5 కిలోమీటర్ల ఓపెన్ మారథాన్ అథ్లెటిక్ పోటీల్లో నాయుడుపేట ఎస్ఎస్ఎఫ్(నాయుడుపేట స్పోర్ట్స్ ఫెడరేషన్) క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించినట్లు ఎస్ఎస్ఎఫ్ వ్యవస్థాపకులు మోమిడి లక్ష్మయ్య తెలిపారు. అండర్–10 విభాగంలో ఎం మహిధర్ మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకున్నట్లు వెల్లడించారు. ఎం. మయూరి అనే బాలిక 6వ స్థానంలో నిలిచి పతకం దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. విజేత అథ్లెట్లను ఎస్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కలికి సుదీప్ రెడ్డి, కలగంధ శీహరి అభినందించారు.



పతకాలు సాధించిన ఎస్ఎస్ఎఫ్ క్రీడాకారులు

## కార్మిక చట్టాలపై అవగాహన అవసరం

**వెంకటగిరి:** భవన నిర్మాణ కార్మికులకు కార్మిక చట్టాలు, ప్రభుత్వం అందించే సంక్షేమం వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ తెలిపారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం సీపీఐ కార్యాలయం ఆవరణలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు వివాహ బహుమతి, ప్రసూతి ప్రయోజనం, ప్రాణాంతక ప్రమాద ఉపశమనం, వైకల్య ఉపశమనం, అంత్యక్రియల ఖర్చులు, పెన్షన్ పథకం వంటి సంక్షేమ పథకాలను వర్తింపజేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేలకోట్లు కేటాయిస్తున్నాయని, అయితే కార్మికులకు అవగాహన లేకపోవడంతో నిధులు నిరుపయోగంగా మారుతున్నాయన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో భవన నిర్మాణ కార్మికులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం తాత్కాలిక కమిటీ నాయకులుగా సి.వరుణ్‌కుమార్, పి.వెంకటేశ్వర్లు, ఆర్.రాజా, మావూరయ్యలను ఎంపిక చేశారు. సీపీఐ నేతలు పి.బాలకృష్ణయ్య, వి.చెంగయ్య, కె.జాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాధాకృష్ణ

## చందనలంకరణలో లక్ష్మీనరసింహుడు



బంగారు గరుడ వాహనంపై విహరిస్తున్న శ్రీవారు



**రాపూరు:** పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి మూలమూర్తి ఆదివారం చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున 4 గంటలకు శ్రీవారి మూలమూర్తికి అభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీవారి మూలమూర్తిని చందనంతో అలంకరించారు. ఉదయం 8 గంటలకు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి, ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి శాస్త్రోక్తంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆదివారం స్వామివారి జన్మనక్షత్రం కావడంతో స్వామి వారికి శాంతిహోమాన్ని నిర్వహించి పూర్ణాహుతిని జరిపించారు. అనంతరం కల్యాణాన్ని నిర్వహించారు. సాయంత్రం బంగారు గరుడవాహనంపై స్వామిని కొలువుదీర్చి మాడ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు.

## క్రికెట్ విజేత కోస్టల్ లెవెన్స్



మాట్లాడుతున్న ఎస్‌ఐ గోపాల్

**చిల్లకూరు:** 14 ఏళ్లగా సీనియర్ క్రికెట్ క్రీడాకారులు కలిసి ఫిబ్రవరిలో మ్యాచ్‌లు నిర్వహించడం సంతోషంగా ఉందని చిల్లకూరు ఎస్‌ఐ గోపాల్ తెలిపారు. మండలంలోని సీనియర్ క్రీడాకారులకు నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సిలికా లెవెన్స్‌పై కోస్టల్ లెవెన్స్ విజయం సాధించింది. ఎస్‌ఐ గోపాల్ చేతులమీదుగా విజేత జట్లకు బహుమతులు అందజేశారు. ఆర్గనైజర్లు మదు, రఘుబాబు, మోహన్, క్రీడాకారులు నాగరాజు, సుబ్రహ్మణ్యం, సందాని, చిరంజీవి, బుజ్జిబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.